క్లుప్తంగా

జలశక్తి అభియాన్ ర్యాలీ



ఊటుకూరు(క్రోసూరు): మండలంలోని ఊటుకూరు గ్రామంలో ఉపాధిహామీ శాఖ ఆధ్వర్యంలో జలశక్తి అభియాన్ ర్యాలీ మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పి.కోటయ్య, ఎంపీడీవో టీవీ రమణ పాల్గొని మహిళలు నీటిని పొదుపుగా వాడటం, వర్షపు నీటిని పొదుపు చేయడం అనే అంశాలపై అవగాహన కల్పించారు. ఎంపీడీవో గ్రామంలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఏఎస్‌ఎంలు, ఆశ వర్కర్లు, అంగన్‌వాడీ వర్కర్లు పాల్గొన్నారు.

మొక్కలతో భూసారానికి రక్షణ



పెదకూరపాడు : మొక్కలు నాటి సంరక్షిస్తే ప్రాణ వాయువుతో పాటు భూసారాన్ని సంరక్షిస్తాయని, పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని జిల్లా తెలుగు రైతు కార్యనిర్వాహక కార్యదర్శి పరుచూరి పూర్ణ చంద్రరావు పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని బుచ్చయ్యపాలెం గ్రామంలో జన చైతన్య సమితి ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణలో భాగంగా రోడ్డు కిరువైపులా మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. జనచైతన్య సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు దాసరి విజయ్ బెన్నిబాబు, కో-ఆర్డినేటర్ వెలితోటి అనిల్ కుమార్ తదితరులు ఉన్నారు.

తహసీల్దారు కార్యాలయంలో ఆర్డీఓ తనిఖీ



ముప్పాళ్ళ: ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా అందిన అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలని సత్తెనపల్లి ఆర్డీవో వి.మురళీకృష్ణ చెప్పారు. స్థానిక తహసీల్దారు కార్యాలయాన్ని మంగళవారం ఆయన తనిఖీ చేశారు. పీజీఆర్ఎస్ ద్వారా అందిన అర్జీల వివరాలు, పరిష్కారాలను ఇన్‌చార్జి తహసీల్దారు సీహెచ్ లక్ష్మీప్రసాద్ వివరించారు. రేషన్ దుకాణాల నిర్వహణ, ఇతర రెవెన్యూ సమస్యలపై ఆర్డీవో సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. గ్రామాల వారీగా పెండింగ్ అంశాలపైన చర్చించారు. రైతులకు, విద్యార్థులకు అవసరమైన ధ్రువీకరణ పత్రాలను పెండింగ్ లేకుండా చూడాలన్నారు.

భక్తిశ్రద్ధలతో సుబ్రహ్మణ్య స్వామి శాంతి కల్యాణం

సత్తెనపల్లి: లోక కల్యాణార్థం ఆషాఢ మాసం కృష్ణపక్షం కృత్తికా నక్షత్రంతో కూడిన పర్వదినాన్ని పురస్కరించుకొని మంగళవారం పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ ఎదుట గల గో సంరక్షణ శాల నందు వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామి వారి శాంతి కల్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్వామి అమ్మవార్లకి అత్యంత వైభవోపేతంగా కల్యాణ మహోత్సవాన్ని నిర్వహించారు. అనంతరం అధిక సంఖ్యలో పాల్గొన్న భక్తులకు తీర్థ ప్రసాదాల వితరణ చేశారు.

ఇసుక ట్రాక్టర్లు పట్టివేత

అచ్చంపేట: మండలంలోని కస్తల ఇసుక రీచ్‌లో అక్రమంగా ఇసుకను తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను అచ్చంపేట పోలీస్ సిబ్బంది మంగళవారం అదుపులోకి తీసుకున్నారు. ఎటువంటి అనుమతులు లేకుండా కస్తల ఇసుక రీచ్‌లో లోడ్ చేసుకుని రవాణాకు సిద్ధంగా ఉన్న మూడు ట్రాక్టర్లను స్వాధీనం చేసుకుని అచ్చంపేట పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఇసుక ట్రాక్టర్లు క్రోసూరు మండలం, ఎర్రబాలెం గ్రామానికి చెందిన వారివిగా తెలిసింది.

రెండు ట్రాక్టర్లు సీజ్

అమరావతి: మండల పరిధిలోని ధరణికోట ఇసుక రీచ్ నుంచి మంగళవారం అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న రెండు ట్రాక్టర్లను అమరావతి పోలీసులు సీజ్ చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ బ్రహ్మం తెలిపారు. మండల పరిధిలోని అమరావతి, ధరణికోట, దిడుగు, మునగోడు,మల్లాది ఇసుక రీచ్‌లలో అక్రమ ఇసుక తవ్వకాలు జరుపకుండా రెవెన్యూ, పోలీసు అధికారులు సమన్వయంతో నిఘా ఏర్పాటు చేసినట్లు డిప్యూటీ తహసీల్దార్ సునీత తెలిపారు. అలాగే వైకుంఠపురం రీచ్‌లో మంగళవారం ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సక్రమమైన క్యూ పద్ధతిలో లారీ లకు 2వేల టన్నుల ఇసుక లోడ్ చేసినట్లు ఆమె తెలిపారు.

పింఛన్‌ల పంపిణీపై అవగాహన

నకరికల్లు: పింఛన్‌లను నిర్ణీత సమయానికి పంపిణీ చేయాలని మండల ప్రత్యేకాధికారి బి.బాలూనాయక్ ఆదేశించారు. పంచాయతీ కార్యదర్శులకు, సచివాలయ సిబ్బందికి ఎన్టీఆర్ భరోసా పింఛన్ పంపిణీపై స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బుధవారం బ్యాంకులకు వెళ్లి పింఛన్ నగదును విత్‌డ్రా చేసుకోవాలన్నారు. ఆగస్టు 1న అన్ని గ్రామాల్లోను నూరుశాతం పింఛన్‌ల పంపిణీ పూర్తిచేయాలన్నారు.

ట్రిపుల్ ధమాకా



సత్తెనపల్లి పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల భవనం

పేదరికం ప్రతిభకు ఏమాత్రం అడ్డు కాదని నిరూపించారు ప్రభుత్వ పాఠశాల విద్యార్థినులు. కాస్త తోడ్పాటు అందిస్తే ఎవరికీ తీసిపోమని నిరూపించారు. గత ఐదేళ్లలో వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం అందించిన సహకారాన్ని అందిపుచ్చుకున్నారు. ప్రణాళికతో ఇష్టపడి చదివితే ఎంతటి లక్ష్యాన్ని అయిన సాధించవచ్చని నిరూపించారు. రాష్ట్రంలోని ట్రిపుల్ ఐటీలకు సత్తెనపల్లి జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల నుంచి ముగ్గురు విద్యార్థినులు ఎంపికై శభాష్ అనిపించుకున్నారు. వారంతా చక్కగా చదువుకొని, జీవితంలో ఉన్నత స్థితికి చేరుకుంటామని ధీమా వ్యక్తం చేస్తున్నారు.

- పేదింటి విద్యా కుసుమాలు
- ట్రిపుల్ ఐటీకీ సత్తెనపల్లి బాలికోన్నత పాఠశాల విద్యార్థులు

సత్తెనపల్లి: జిల్లాలో 2023-24 విద్యా సంవత్సరంలో పలు ఉన్నత పాఠశాలల్లో 10వ తరగతి చదివిన వారిలో ఎంతోమంది విద్యార్థులు ట్రిపుల్ ఐటీలో సీట్లు పొందారు. వారిలో సత్తెనపల్లి జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల నుంచి ముగ్గురు విద్యార్థినులున్నారు. గత విద్యా సంవత్సరంలో ఉత్తమ మార్కులు సాధించి, ట్రిపుల్ ఐటీ ఇడుపులపాయ, నూజివీడుకు ఎంపికయ్యారు. పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో 179 మంది విద్యార్థినులు 10వ తరగతి పబ్లిక్ పరీక్షలు రాశారు. వారిలో 130 మంది ఉత్తీర్ణులు కాగా 73 శాతం ఉత్తీర్ణత సాధించారు. 87 మంది విద్యార్థినులు ఫస్ట్ క్లాసు, 31 మంది సెకండ్ క్లాస్‌లో ఉత్తీర్ణులయ్యారు. 500కు పైన మార్కులను 18 మంది విద్యార్థినులు సాధించారు. వీరిలో సీహెచ్ కోమలి 580/600, సీహెచ్ దీపికాంజలి 578/600, కె.రేణుక 568/600 మార్కులు సాధించి పాఠశాల స్థాయిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. ఈ ముగ్గురు విద్యార్థినులు ఇడుపులపాయ, నూజివీడులో ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యారు. ఈ నెల 23, 25న కౌన్సెలింగ్ కోసం వెళ్లి వచ్చారు.

సాఫ్ట్ వేర్‌గా స్థిరపడతా



సత్తెనపల్లి జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో 2023-24 విద్యా సంవత్సరంలో పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో 580/600 మార్కులు సాధించి పాఠశాల టాపర్‌గా నిలిచా. అమ్మ పద్మావతి, నాన్న వెంకటేశ్వరరావు రెక్కల కష్టంతో నేను, అక్క చదువు కుంటున్నాం. నేను 6 నుంచి 10వ తరగతి వరకు బాలికోన్నత పాఠశాలలో చదివా. నాన్న వెంకటేశ్వరరావు వ్యవసాయ కూలీ. అమ్మ ఇంటి వద్ద పని చేస్తుంది. అక్క ఇంటర్ పూర్తి చేసి ప్రస్తుతం డిగ్రీ చదువుతోంది. నాకు నూజివీడు ట్రిపుల్ ఐటీలో సీటు సాధించడం ఆనందంగా ఉంది. ఎంపీసీ గ్రూప్ తీసుకుని సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా స్థిరపడి నా కుటుంబానికి చేదోడు వాదోడుగా ఉంటా.

–తల్లిదండ్రులు వెంకటేశ్వరరావు, పద్మావతి తో సీహెచ్ కోమలి

అమెరికా వెళ్లడమే లక్ష్యం



నేను పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో చదివాను. 2023-24 విద్యా సంవత్సరంలో పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో 578/600 మార్కులు సాధించి పాఠశాల స్థాయిలో ద్వితీయ స్థానంలో నిలిచాను. అమ్మ ఉమామహేశ్వరి కుట్టు మిషన్ వర్క్ చేస్తుంది. నాన్న శ్రీనివాసరావు తాపీ పనులు చేస్తుంటారు. నూజివీడు ట్రిపుల్ ఐటీలో సీటు సాధించడం ఎంతో ఆనందంగా ఉంది. తల్లిదండ్రుల కష్టాలను దగ్గర నుంచి చూశాను. ట్రిపుల్ ఐటీలో ఎంపీసీ గ్రూప్ తీసుకొని ఇంజినీరింగ్ చేస్తా. అమెరికా వెళ్లి ఉన్నత ఉద్యోగంలో స్థిరపడి తల్లిదండ్రులను బాగా చూసుకోవాలన్నదే లక్ష్యం. – తల్లిదండ్రులు శ్రీనివాసరావు, ఉమామహేశ్వరితో దీపికాంజలి

సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ అవుతా



నేను సత్తెనపల్లి జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో 2023-24 విద్యా సంవత్సరంలో 10వ తరగతి పబ్లిక్ పరీక్షల్లో 568/600 మార్కులు సాధించి పాఠశాల స్థాయిలో తృతీయ స్థానంలో నిలిచా. ఉపాధ్యాయుల బోధనలు, సూచనలు నాకు ఎంతో ఉపయోగపడ్డాయి. అమ్మ మాధవి ఇంటి వద్ద పనిచేస్తుంది. నాన్న నాగేశ్వరరావు హార్డ్‌వేర్ షాపులో పనిచేస్తున్నారు. వారిద్దరూ ఎంతో కష్టపడి నన్ను చదివిస్తున్నారు. నాకు ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీలో సీటు వచ్చింది. ఈ నెల 25న కౌన్సిలింగ్‌కు కూడా వెళ్లి వచ్చా. ఎంపీసీ గ్రూప్ తీసుకొని, సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా స్థిరపడి అమ్మా, నానల కష్టాలను తీర్చాలి. అదే నా లక్ష్యం.

–తల్లిదండ్రులు నాగేశ్వరరావు, మాధవితో కె.రేణుక

హెల్మెట్ లేని ప్రయాణం ప్రమాదకరం



మాట్లాడుతున్న మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ రాంబాబు

సత్తెనపల్లి: హెల్మెట్ లేని ప్రయాణం ప్రమాదకరమని ప్యానల్ న్యాయవాది డి. శ్రీనివాసరావు అన్నారు. రాష్ట్ర సర్వోన్నత న్యాయస్థానం ఆదేశాల మేరకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ గుంటూరు వారి ఆదేశాను సారం మండల న్యాయసేవా ధికార అధికార సంస్థ చైర్మన్, సీనియర్ సివిల్ జడ్జి వెంకట నాగ శ్రీనివాసరావు సూచనల మేరకు మోటారు వాహనాల చట్టం గురించి పట్టణంలోని రైల్వే స్టేషన్ ఆటోస్టాండ్ వద్ద మంగళవారం న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ వాహన దారులు రోడ్డు ప్రమాదాలపై జాగ్రత్తలు పాటించాలన్నారు. ద్విచక్ర వాహన దారులు విధిగా హెల్మెట్ ధరించాలని, లేకపోతే ప్రమాదాల బారిన పడటమే కాక ఒక్కోసారి ప్రాణాలు కూడా పోతున్నాయని హెచ్చరించారు. యువత రోడ్డు ప్రమాదాల్లో తలకు ఎక్కువగా గాయం కావడం వల్ల చనిపోతున్నారని పేర్కొన్నారు. ఈ నెల ఒకటి నుంచి దేశంలో కొత్త చట్టాలు అమలులోకి వచ్చాయని, అంతేకాకుండా మైనర్లకు వాహనాలు ఇవ్వకూడదని అలా ఇస్తే వాహన యజమానులకు, తలిదండ్రులకు కూడా శిక్షలు పడే విధంగా నూతన చట్టాలు ఉన్నాయన్నారు. పిడుగురాళ్ల మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ సి.హెచ్ రాంబాబు మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల్లో ఎక్కువగా 25 ఏళ్ల నుంచి 35 ఏళ్ల లోపు యువత చనిపోవడం జరుగు తుందని, అతి వేగం అత్యంత ప్రమాదకరమన్నారు. మండల న్యాయ సేవ సాధికార సంస్థ వల్ల ప్రజలకు కలిగే ఉపయోగాలు గురించి వివరించారు. వాహనాలకు ఇన్స్యూరెన్సు అవసరమని, వాహనదారులు తప్పనిసరిగా లైసెన్సులు తీసుకోవాలని, 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ చదువుతో సంబంధం లేకుండా డ్రైవింగ్ లైసెన్సులు ఇవ్వడం జరుగుతుందన్నారు. సదస్సులో ప్యానల్ న్యాయవాది గంటా వెంకట శివ, పారాలీగల్ వలంటీర్లు షేక్ సుభాని, జక్కుల లక్ష్మీనారాయణ, సత్తెనపల్లి పట్టణ పోలీస్ స్టేషన్ కోర్టు కానిస్టేబుల్ షేక్ బాజీ, ఆటో డ్రైవర్లు, ప్రజలు పాల్గొన్నారు.

దోమలను నిర్మూలిద్దాం.. వ్యాధులను తరిమేద్దాం.

పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ రాంబాబునాయక్



ర్యాలీలో పీహెచ్‌సీ వైద్య సిబ్బంది, విద్యార్థులు

అచ్చంపేట: దోమలను నిర్మూలించి, వాటిద్వారా వ్యాప్తి చెందే వ్యాధులను తరిమికొట్టాలని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ పి.రాంబాబునాయక్ పిలుపునిచ్చారు. డెంగీ వ్యాధి నివారణ మాసోత్సవ ముగింపు కార్యక్రమంలో భాగంగా మంగళవారం అచ్చంపేటలో స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాల, కళాశాలలో విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ర్యాలీను ద్దేశించి వైద్యాధికారి మాట్లాడారు. ఇటీవల కురుస్తున్న వర్షాలకు పాఠశాల, ఇంటి పరిసరాలు, పల్లపు ప్రాంతాల్లో వర్షపు నీరు నిల్వ ఉండి అవి మురుగుగా మారి అందులో లార్వా వృద్ధిచెందుతుందని చెప్పారు. వర్షపు నీరు నిల్వ ఉన్న ప్రదేశాలలో అబేట్ ద్రావణాన్ని చల్లి లార్వా దశని నశింపచేయవచ్చాన్నారు. వాడిన కొబ్బరిబొండాలు దూరంగా పారేయాలని, వాడకంలోలేని గాబులు బోర్లించాలని సూచించారు. విద్యార్థులు శుద్ధి చేసిన నీటిని తాగాలని, భోజనం ముందు, తరువాత చేతులు శుభ్రపరచుకోవాలని జాగ్రత్తలు చెప్పారు. సత్తెనపల్లి సబ్ యూనిట్ మలేరియా అధికారి సుభాన్ మహమ్మద్ బేగ్ మాట్లాడుతూ ప్రతి శుక్రవారం డ్రైడేగా పాటించాలని, పరిసరాలలో నీరు నిల్వఉండకుండా చూచుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ అరుణ్‌కుమార్, సీహెచ్ఒ శివనాగేశ్వరి, హెచ్‌ఎస్ రాధాకృష్ణ, హెచ్‌వి రామకోటమ్మ, సీహెచ్ఒ సత్యానందం, ఫకృద్దీన్, ఆశాకార్యకర్తలు పద్మ, శిరీష పాల్గొన్నారు.

ముద్ద చర్మ వ్యాధి నివారణకు టీకాలు

అచ్చంపేట: స్థానిక పశు సంవర్ధక వైద్యశాలలో తెల్లజాతి పశువులకు ముద్ద చర్మ వ్యాధి నివారణకు టీకాలు వేస్తున్నట్లు పశువైద్యాధికారి డాక్టర్ స్వాతీదేవి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వ్యాధికి గురైన తెల్లజాతి పశువులైన ఆవులు, ఎద్దుల చర్మపై బొబ్బలు ఏర్పడతాయని దీంతో పశువులను వెంటనే పశువైద్యశాలకు తీసుకురావాలని కోరారు.

మినీ గోకులాలకు దరఖాస్తుల ఆహ్వానం

మినీ గోకులాల నిర్వహణకు ఉపాధి హామీ పథకం ద్వారా ఆర్థిక సహాయం కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు మండల పశువైద్యాధికారి డాక్టర్ స్వాతీదేవి తెలిపారు. ఇందులో మూడు రకాల యూనిట్స్ ఉంటాయన్నారు. రెండు పశువుల యూనిట్ విలువ రూ.1,15,000లు కాగా, రైతు వాటాగా రూ.11,500లు భరించాల్సి ఉంటుందన్నారు. నాలుగు పశువుల యూనిట్ విలువ రూ.1,85,000లు కాగా రైతు వాటాగా రూ.18,500లు, 6 పశువుల యూనిట్ విలువ రూ.2,30,000లు కాగా రైతు వాటాగా రూ.23,000 భరించాల్సి ఉంటుందని చెప్పారు. దరఖాస్తు చేసుకునేవారు ఎస్సీ, ఎస్టీ, వలస, డీనోటిఫైడ్ తెగలవారై ఉండాలన్నారు.

అంగ వైకల్యం కల వారు, మహిళలు, అటవీ హక్కుల చట్టం-2006 ద్వారా లబ్ధి పొందిన వారు, చిన్న, సన్నకారు రైతులు కూడా అర్హత కలిగి ఉంటారని చెప్పారు. ఉత్సాహవంతులైన రైతులు సంబంధిత దరఖాస్తు ఫాం పూర్తి చేసి ఆధార్ కార్డు, ఉపాధి హామీ పథకం జాబ్ కార్డు, గోకులం నిర్వహించే ప్రదేశం హక్కు పత్రం, బ్యాంక్ పాసు పుస్తకం నకళ్లు జతపరచాలన్నారు. పూర్తి వివరాలకు స్థానిక పశువైద్యశాలలో సంప్రదించాలని పశువైద్యాధికారి డాక్టర్ శ్వాతీదేవి తెలిపారు.

నేడు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు

క్రోసూరు: మండలంలోని విప్పర్ల గ్రామ పరిధిలో ఉన్న ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో సివిల్, ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ డిప్లొమా కోర్సుల కు మిగిలి ఉన్న ఖాళీలను బుధవారం స్పాట్ అడ్మిషన్ల ద్వారా భర్తీ చేయనున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ బీవీ రమాదేవీ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్పాట్ అడ్మిషన్ల ద్వారా చేరాలనున్న అభ్యర్థులు 10 వ తరగతి ఉత్తీర్ణత సర్టిఫికెట్, ఇతర ఒరిజనల్ సర్టిఫికెట్లతో కళాశాలలో హాజరు కావాలని కోరారు. పూర్తి ఫీజు రూ.4,700, కౌన్సిలింగ్ ఫీజు రూ.1100 చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు రూ.350 చెల్లించాలన్నారు. ప్రవేశం పొందిన అభ్యర్థులకు ఎటువంటి ఫీజు రీయింబర్స్‌మెంట్ వర్తించదని తెలిపారు. ఇతర వివరాలకు 94406 13009 నంబరుకు సంప్రదించాలని తెలిపారు.

ఇసుక లారీలు సీజ్

క్రోసూరు: అక్రమంగా తరలిస్తున్న రెండు ఇసుక లారీలను మంగళవారం సీజ్ చేసినట్లు ఎస్ఐ ఎం.షఫీ తెలిపారు. అచ్చంపేట మండలంలోని కోనూరు రీచ్ నుంచి ఒకటి నరసరావుపేటకు, ఒక పేరేచర్లకు తరలిస్తున్నట్లు ఎస్ఐ చెప్పారు. రెండు లారీలను సీజ్ చేసి, కేసులు నమోదు చేశామని చెప్పారు.

మానవ అక్రమ రవాణాకు వ్యతిరేకంగా మానవహారం



మానవహారంగా విద్యార్థులు..

అమరావతి: స్థానిక మెయిన్ రోడ్డులో మానవ అక్రమ రవాణాకు వ్యతిరేకంగా భారీ ర్యాలీ నిర్వహించారు. తొలుత బస్టాండ్ సెంటర్ నుంచి విద్యార్థులతో బయలు దేరిన ర్యాలీ మద్దూరు డౌన్ సెంటర్ వరకు సాగింది. ఈ సందర్భంగా విద్యార్థులు మానవహారంగా ఏర్పడి మానవ అక్రమ రవాణాకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఏవీ బ్రహ్మం మాట్లాడుతూ మానవ అక్రమ రవాణా నేడు ప్రపంచవ్యాప్తంగా ఉందన్నారు. అపరిచిత వ్యక్తులు ఇచ్చే తినుబండారాలు ఎవరు తీసుకోకూడదని హెచ్చరించారు. కొత్త వ్యక్తులు సంచారంపై అనుమానం వచ్చిన వెంటనే 100కు కాల్ చేస్తే పోలీసులు 24 గంటలు అందుబాటులో ఉంటారన్నారు అక్రమ రవాణా ఎక్కడో జరగటం లేదని, మన మధ్యలోనే జరుగుతుందన్నారు. కొత్త పరిచయాలు అక్రమ రవాణాకు దారి తీస్తాయన్నారు. ప్రతి ఒక్కరూ కలిసి వచ్చి అక్రమ రవాణాని అరికట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో మానవ అక్రమ రవాణా నిరోధక శాఖ సిబ్బంది మంగమ్మ , కోటేశ్వరరావు జిల్లా బాలల సంరక్షణ విభాగం ప్రతినిధులు కృష్ణారెడ్డి, శైలజ గుడ్ షెపర్డ్ సిబ్బంది, పలోటి జూనియర్ కాలేజ్ సిబ్బందితో పాటు 400 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో తక్కువ పెట్టుబడి

ప్రకృతి వ్యవసాయం జిల్లా అధికారి అమలకుమారి

బెల్లంకొండ: రైతులు ప్రకృతి వ్యవసాయ విధానంలో తక్కువ పెట్టుబడితో పంటలు పండించవచ్చని ప్రకృతి వ్యవసాయ జిల్లా అధికారి అమలకుమారి తెలిపారు. మంగళవారం మండలంలోని నాగిరెడ్డిపాలెం గ్రామంలో పలు ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలను ఆమె పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ గ్రామానికి చెందిన ప్రకృతి వ్యవసాయ రైతు జ్యోతి 10 సెంట్లలో సూర్య మండల మోడల్ వేయడం జరిగిందన్నారు. ఈ మోడల్ వల్ల వారి కుటుంబానికి అవసరమైన ఆకుకూరలు, కూరగాయలు, దుంప, తీగ జాతి కూరగాయలు లభిస్తున్నాయన్నారు. అదనపు ఆదాయం చేకూరుతుందని తెలిపారు. రెండు ఎకరాల విస్తీర్ణంలో ఘనజీవామృతంతో కలిపి బీజామృతంతో విత్తన శుద్ధి చేసిన వరి విత్తనాలను వెద పద్ధతి ద్వారా విత్తడం జరిగిందన్నారు. ఈ విధానం వల్ల రైతుకి నాట్లకి, దమ్ము చేసేందుకు అయ్యే ఖర్చు పూర్తిగా మిగులుతుందని తెలిపారు. ఘన జీవామృతం వేయడం వలన భూమిలో వేరు వ్యవస్థ లోతుగా వెళ్లి ప్రకృతి వైపరీత్యాలను తట్టుకునే శక్తి లభిస్తుందన్నారు. కార్యక్రమంలో అడిషనల్ డీపీఎం ప్రేమ్ రాజ్, పవన్, సైదయ్య, సంధ్య, అనంతలక్ష్మి, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ వృత్తి ఎనలేనిది



ఎంఈఓ నరసింహరావు దంపతులను సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

అచ్చంపేట: ఉపాధ్యాయ వృత్తి ఎనలేనదని, గౌరవప్రదమైనదని అలాంటి వృత్తిని దైవంగా భావించి, ఉత్తమ సేవలు అందించినవారే విద్యార్థుల మనస్సులలో చిరస్థాయిగా గుర్తిండిపోతారని అచ్చంపేట ఎంఈవో-1 ఏకుల ప్రసాదరావు అన్నారు. అచ్చంపేట ఎంఈవో-2 రావిపాటి నరసింహారావు ఉద్యోగ విరమణ సందర్భంగా స్థానిక శ్రీ షిర్డి సాయిబాబా కల్యాణ మండపంలో మంగళవారం జరిగిన సభలో ఆయన మాట్లాడారు. గత 35 సంవత్సరాలపాటు ఉపాధ్యాయునిగా, ప్రధానోపాధ్యాయునిగా, మండల విద్యాశాఖాధికారిగా పనిచేసిన నరసింహారావు పూర్తిగా సేవాభావంతో, బాధ్యతతో పనిచేశారన్నారు. వారి శిష్యరికంలో ఎందరో విద్యార్థులు వివిధ హోదాలలో, రంగాల్లో ప్రముఖులుగా స్థిరపడ్డారని చెప్పారు. అనంతరం ఉపాధ్యాయ యూనియన్ సభ్యులు నరసింహారావు దంపతులను దుశ్శాలువాలు, పూలమాలలు, జ్ఞాపికలతో ఘనంగా సత్కరించారు. సభకు హెచ్‌ఎం ఆళ్లమూడి వెంకటేశ్వరరావు అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు జి.గంగయ్య, బంకా వాసుబాబు, రాంబాబు, శౌరిరెడ్డి, సాంబిశవరావు, భాషా, వివిధ మండలాల విద్యాశాఖాధికారులు, ప్రధానోపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

9న మాలల మహా ధర్నాను విజయవంతం చేయాలి

మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ గోదా జాన్ పాల్



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న డాక్టర్ గోదా జాన్‌పాల్

సత్తెనపల్లి: ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ఆగస్టు 9న జరుగనున్న రెండు తెలుగు రాష్ట్రాల మాలల మహాధర్నాని విజయవంతం చేయాలని మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ గోదా జాన్‌పాల్ పిలుపునిచ్చారు. సత్తెనపల్లిలో మంగళవారం హలో మాలా- చలో ఢిల్లీ కరపత్రాలను నియోజకవర్గ అధ్యక్షుడు గుంటూరు ఆశీర్వాదం అధ్యక్షతన ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ గోదా జాన్‌పాల్ మాట్లాడుతూ భారత రాజ్యాంగాన్ని విచ్ఛిన్నం చేయాలనే దురుద్దేశంతో ఎస్సీ వర్గీకరణ అంశాన్ని పార్లమెంటు సమావేశాల్లో బిల్లు పెట్టకుండా రెండు తెలుగు రాష్ట్రాల నుంచి మాల సంఘాల నాయకుల ఆధ్వర్యంలో మాలల మహాధర్నా ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నిర్వహించబోతున్నామన్నారు. ఆంధ్రప్రదేశ్ జేఏసీ చైర్మన్ గోళ్ల అరుణ్ కుమార్ ఆధ్వర్యంలో వేలాదిగా ఢిల్లీకి తరలి రావాలని పిలుపునిచ్చారు. కర పత్రాల ఆవిష్కరణలో పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు దాసరి జ్ఞాన రాజ్ పాల్, పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి ఏకుల రాజశేఖర్, మాల ఉద్యోగ సంఘాల నియోజ కవర్గ అధ్యక్షుడు మాలే మరియదాసు, పెదకూరపాడు నియోజకవర్గ ఇన్‌చార్జి మాతంగి సుధాకర్, నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి జడ కమల్, పట్టణ అధ్యక్షుడు కూచిపూడి జాన్ బాబు, ఉపాధ్యక్షుడు మాతంగి రాహుల్ గౌతమ్, ముప్పాళ్ళ మండల అధ్యక్షుడు సేవా చంద్ర, గౌరవ అధ్యక్షుడు పద్మారావు, గౌరవ ఉపాధ్యక్షుడు బిల్లా రవి, సత్తెనపల్లి మండల రూరల్ అధ్యక్షుడు కుంచకర్ల జోసెఫ్, అంబేడ్కర్ యువజన సంఘం అధ్యక్షుడు జిల్లెళ్ల పాల్‌రాజ్ పాల్గొన్నారు.

నీటిని పొదుపుగా వాడుకోవాలి

డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ బాలూనాయక్



ర్యాలీ నిర్వహిస్తున్న ప్రాజెక్టు డైరెక్టర్, అధికారులు

రాజుపాలెం: ప్రతీ ఒక్కరు నీటి నినిల్వ చేసుకుని పొదుపుగా వాడుకోవాలని డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ బాలూ నాయక్ తెలిపారు. మండల కేంద్రంలో నారీశక్తి సే జలశక్తి కార్యక్రమంలో భాగంగా రాజుపాలెం పురవీధుల్లో నీటి పొదుపు వాడకంపై మంగళవారం ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో ముఖ్య అతిథిగా పాల్గొన్న డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ మాట్లాడుతూ నీటి సంరక్షణ భూర్భజలాలను భవిష్యత్తు తరాలకు అందించడంపై అవగాహన కల్పించారు. పురవీధుల్లో నినాదాలు చేసుకుంటూ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో ఎంపీడీవో రామకృష్ణ ప్రసాద్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ భవానీ, పంచాయతీ రాజ్ శాఖ ఏఈ నరసింహారావు, ఏపీఎం సునీత, ఏపీవో సీహెచ్ వెంకటేశ్వర్లు, వెలుగు సీసీలు, ఈఓఏలు తదితరులు పాల్గొన్నారు.

కక్షలు వీడి ప్రశాంతంగా జీవించాలి

బెల్లంకొండ: గ్రామాలలో కక్షలు వీడి ప్రశాంతంగా జీవించాలని ఎస్ఐ రాజేష్ తెలిపారు. మంగళవారం బెల్లంకొండలో జండా చెట్టు వద్ద గ్రామస్తులతో సమావేశం నిర్వహించారు. ఎస్ఐ మాట్లాడుతూ ప్రశాంతంగా ఉన్న గ్రామాల్లో గొడవలు సృష్టించి శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే ఎంతటి వారి పైన అయినా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. యువత మద్యం, గుట్కా వంటి చెడు వ్యసనాలకు గురవకుండా ఉండాలని కోరారు. తగాదాలు ఉంటే పోలీసులను సంప్రదించాలని తెలిపారు. ఎస్ఐ వెంట ఏఎస్ఐ ముసలరావు, కానిస్టేబుళ్లు రాజేష్, వెంకట్రావు తదితరులు ఉన్నారు

భూసార పరీక్షల ఆధారంగా ఎరువులు వినియోగించాలి

బెల్లంకొండ: భూసార పరీక్షలను రైతులు ఎప్పటికపుడు చేయించాలని, వాటి ఆధారంగా ఎరువులను వినియోగించాలని జిల్లా వనరుల కేంద్రం డెప్యూటీ డైరక్టర్ శివకుమారి తెలిపారు. మంగళవారం మండలంలోని చంద్రాజుపాలెం గ్రామంలో వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ (ఆత్మ) సౌజన్యంతో వాతావరణ ఆధారిత పంటల సాగు, భూసార పరీక్షలు ఆధారంగా సమతుల్య పోషకాల వాడకంపై రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ రైతులు భూసార పరీక్షలు అనుసరించి సేంద్రియ, జీవన ఎరువులు,రసాయన ఎరువులు సిఫారసు మోతాదులో పంటలలో వాడుట వలన భూ ఆరోగ్యం తో పాటు, మానవుని ఆరోగ్యం బాగుంటుందన్నారు. క్రోసూరు డివిజన్ ఏడీఏ వి.హనుమంతరావు మాట్లాడుతూ పచ్చి రొట్ట పైరు పెంచి భూమిలో కలియ దున్నడం వల్ల భూమిలో సేంద్రియ కర్బణం పెరుగుతుందన్నారు. ప్రకృతి వ్యవసాయం ఆవశ్యకత తెలుసుకోవాలని, ప్రతి రైతు కనీసం కొద్ది విస్తీర్ణం తో మొదలు పెట్టి క్రమేణా పెంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి డి. క్రిష్ణయ్య, గ్రామ ఉద్యాన సహాయకురాలు డి.రజని, సిబ్బంది సాయికిరణ్, అయ్యప్ప, రహంతుల్లా, ఆశాబి, ప్రసాదరావు, మణికంఠ గ్రామ రైతులు పాల్గొన్నారు.

స్పర్శ లేని మచ్చలపై వైద్యులను సంప్రదించాలి



కోటనెమలిపురిలో లెప్రసీ సర్వేను పరిశీలిస్తున్న హెల్త్ సూపర్‌వైజర్

రాజుపాలెం: ఎవ్వరికైన ఒంటిపైన మచ్చలు ఉండి స్పర్శ లేకుంటే సమీపంలోని వైద్య సిబ్బందిని సంప్రదించాలని పీహెచ్‌సీ హెల్త్ సూపర్‌వైజర్ జీవన్‌రావు తెలిపారు. మండలంలోని అంచులవారిపాలెం, కోట నెమలిపురి గ్రామ సచివాలయాల్లో జరుగుతున్న లెప్రసీ సర్వేని ఆయన మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా హెల్త్ సూపర్‌వైజర్ మాట్లాడుతూ ఇప్పటి వరకు మండలంలో 40 అనుమానిత లెప్రసీ కేసులను గుర్తించినట్లు తెలిపారు. వారికి జిల్లా స్థాయిలో వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు అందిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో హెల్త్ అధికారి శిరీష ప్రియదర్శిని ఆరోగ్య, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.